సాక్షి
నారాయణపేట
మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



అడ్డుకట్ట పడేనా?
ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల అవినీతికి అడ్డుకట్ట పడటం లేదు.
వివరాలు 8లో ▸



కురుమూర్తి హుండీ లెక్కింపు
కురుమూర్తిస్వామికి భక్తులు సమర్పించిన కానుకల హుండీలను లెక్కించారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.5 /21.6

వాతావరణం
ఉదయం కొద్దిమేర ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నర్సింగ్ కళాశాల ప్రారంభం



నారాయణపేట: జిల్లాకు ఇటీవలే మంజూరైన నర్సింగ్ కళాశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావస్తున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా సోమవారం హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో జరిగిన ఆరోగ్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన సీఎం వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అక్కడి నుంచే ప్రారంభించారు. అందులో భాగంగా నారాయణపేట నర్సింగ్ కళాశాలను కూడా వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. కాగా ముఖ్యమంత్రి ఆరోగ్య ఉత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు నారాయణపేట మండలంలోని అప్పక్‌పల్లి వద్ద గల మెడికల్ కళాశాల సమావేశ మందిరం వేదిక అయింది. సీఎం ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ బేన్ షాలం, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కిషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ సౌభాగ్య లక్ష్మి, నర్సింగ్, పారామెడికల్ విద్యార్థులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ జయ, మెడికల్ కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



మరికల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం మరికల్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. అనంతరం పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులకు అర్థవంతమైన పద్ధతిలో పాఠ్యాంశాలు బోధించాలని, పరీక్షలు రాసే విధానంపై మెలకువలు నేర్పించాలని, ఒత్తిడి జయించేలా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు.

ఎర్ర కందులు క్వింటా రూ.11వేలు

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఎర్ర కందులు క్వింటా గరిష్టంగా రూ.11,621, కనిష్టంగా రూ.9,311 ధర పలికాయి. అలాగే, తెల్ల కందులు గరిష్టంగా రూ.11,621, కనిష్టంగా రూ.10 వేలు ధర పలికాయి.

భక్తులకు ఇబ్బందులు కల్గించొద్దు : ఎమ్మెల్యే



మక్తల్: శ్రీ పడమటి ఆంజనేయస్వామి జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గించొద్దని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మక్తల్‌లో శ్రీ పడమటి ఆంజనేయస్వామి జాతర సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈనెల 13 నుంచి 19 వరకు నిర్వహించే ఉత్సవాలలో భక్తుల కు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. రాంలీలా మైదానంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, రోడ్డుకు రెండు వైపుల వీధిలైట్లు అమర్చాలన్నారు. ట్రాఫిక్ వల్ల ప్రజలకు ఇబ్బందులు కల్గరాదన్నారు. విద్యుత్, తాగునీటి, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఎ మ్మెల్యే విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, బీకేఆర్ బాలకృష్ణారెడ్డి, మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ గౌడ్, ఆలయ చైర్మన్ ప్రణేష్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చకచకా.. ఆన్‌లైన్ నమోదు



మద్దూర్‌లో సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న సీపీఓ యోగానంద్

- సమగ్ర కుటుంబ సర్వే వివరాల కంప్యూటరీకరణ 79శాతం పూర్తి
- జిల్లాలో 1,58,489 కుటుంబాలవివరాల సేకరణ
- ఇప్పటివరకు 1,24,751 కుటుంబాల వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం
- 1,200 మంది ఆపరేటర్లతో ప్రక్రియ వేగవంతం
- రెమ్యూనరేషన్‌కు రూ.47.54 లక్షలు ?

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే కార్యక్రమం జిల్లాలో వేగంగా సాగుతోంది. ఇప్పటి వరకు 79 శాతం కంప్యూటరీకరణ పూర్తయ్యింది. జిల్లా వ్యాప్తంగా 1,55,999 కుటుంబాలను గుర్తించగా.. లక్ష్యానికి మించి 1,58,489 కుటుంబాల వివరాలను సేకరించారు. అందులో 1,24,751 కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేశారు. సర్వే ప్రక్రియను ఎప్పటికప్పుడు కలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షిస్తున్నారు.

ఆన్‌లైన్‌కు రెమ్యునరేషన్ రూ.47,54,670 ?
సర్వేలో భాగంగా జిల్లాలో 1181 మంది ఎన్యుమరేటర్లు 1,58,489 కుటుంబాల వివరాలను సేకరించారు. సదరు డాటాను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు 1200 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రభుత్వం రెమ్యూనరేషన్ ఇవ్వనుంది. అందులో ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వర్తించే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ బేసిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్క కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు రూ.14 ఇవ్వాలని, ప్రైవేట్ ఆపరేటర్లకు రూ.30 ఇవ్వాలని మొదట నిర్ణయించింది. అయితే ప్రైవేట్‌తోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఆపరేటర్లకు సమానంగా ఇవ్వాలని కలెక్టర్‌ను వారు కోరినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో అందరికి ఒకేరకమైన పారితోషకాన్ని ఇవ్వాలనుకుంటే మొత్తంగా రూ.47,54,670 అయ్యే అవకాశం ఉందని అధికార యంత్రాంగం భావిస్తోంది.

వంద శాతం పూర్తి చేస్తాం
సమగ్ర కుటుంబ సమగ్ర సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఇప్పటివరకు 79శాతం పూర్తి అయ్యింది. మరో రెండు రోజుల్లో వంద శాతం పూర్తి చేస్తాం.
– యోగానంద్, సీపీఓ, నారాయణపేట

వారం రోజులుగా..
సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన 1,58,489 కుటుంబాల వివరాలను జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవ, సీఎస్‌సీ సెంటర్లు, ప్రైవేట్ ఆపరేటర్లు మొత్తం 1200 మందితో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గత వారం రోజులుగా వివరాల నమోదు ముమ్మరం చేయడంతో 1,24,751 కుటుంబాలను నమోదుచేశారు. ఒక్కో ఆపరేటర్ 10 నుంచి 15 నిమిషాల్లో ఒక కుటుంబం వివరాలను నమోదు చేసేందుకు సమయం పడుతుంది. దీంతో రోజుకు 30 నుంచి 40 కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మరో రెండురోజుల్లో వంద శాతం పూర్తి అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో మండలాల వారీగా సర్వే వివరాలిలా..

మండలం	సర్వే చేసిన కుటుంబాలు	ఆన్‌లైన్‌లో నమోదు చేసినవి..	శాతాల్లో
నారాయణపేట	15,978	15,488	97
దామరగిద్ద	15,432	10,789	70
ఊట్కూర్	14,927	13,037	87
మక్తల్	13,632	11,250	83
మద్దూర్	11,936	8,958	75
మరికల్	10,630	8,084	76
నర్వ	10,146	5,941	59
మాగనూర్	7,450	6,891	92
ధన్వాడ	9,498	8,452	89
కోస్గి	7,561	4,193	55
కృష్ణా	7,512	4,446	59
గుండుమాల్	5,390	4,004	74
కొత్తపల్లి	5,318	3,126	59
మున్సిపాలిటీల్లో..			
నారాయణపేట	10,592	10,389	98
మక్తల్	6525	6161	94
కోస్గి	5962	3542	59

అంకితభావంతో పని చేయాలి



నూతన పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చెయ్యాని, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో 9 నెలల ట్రైనింగ్ పూర్తి చేసుకొని విధుల్లో చేరిన 78 మంది కానిస్టేబుళ్లకు, 47మంది సివిల్ కానిస్టేబుళ్లకు ఎస్పీ పోస్టింగ్ ఇచ్చారు. అలాగే 31 మంది అర్మ్‌డ్ రిజర్వు పోలీసులకు జిల్లా స్పెషల్ పార్టీకి పోస్టింగ్ ఇచ్చి వారికి ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పని చేయడం అనేది ప్రజలకు అత్యంత చేరువగా ఉంటూ సేవ చేసే గొప్ప అవకాశమన్నారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అత్యున్నత స్థాయిలో జిల్లాలో పోలీసులు వినియోగిస్తున్నారని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. పలు సమస్యల పరిష్కారం కోసం వచ్చే బాధితులకు మేమున్నామనే భరోసా కల్పించాలని, విధి నిర్వహణలో కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలన్నారు. క్రమశిక్షణ ఎంతో ముఖ్యమైనదని, అధికారులు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు శంకర్‌లాల్, రామ్‌లాల్, నరసింహ, శివశంకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు
నారాయణపేట: శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని తెలిపారు. ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ యాక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని పేర్కొన్నారు.

ప్రభుత్వాలు అణచివేత ధోరణి విడనాడాలి

- ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



దామరగిద్దలో మాట్లాడుతున్న ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

నారాయణపేట టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, రైతులపై అణచివేత ధోరణి వ్యవహరిస్తున్నాయని.. ప్రజల హక్కులను హరిస్తున్నాయని, చివరికి ఆందోళనకు మద్దతు తెలిపే కార్మిక రైతు నాయకులను అర్బన్ నక్సలైట్ల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, ఇది సరైన పద్ధతి కాదని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోదీ పదేళ్ల కాలంలో కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లు లాభం చేకూరేలా అనుకూలమైన విధానాలు అమలు చేశారని, రూ.10లక్షల కోట్ల బ్యాంకు రుణాలు, రూ.8లక్షల కోట్ల పన్నులు రద్దు చేస్తూ.. కారుచౌకగా ప్రభుత్వ రంగాలను వారికి కట్టబెడుతున్నాడని ఆరోపించారు. ఇక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత సీఎం కేసీఆర్ అమలు చేసిన విధానాలను కొనసాగిస్తున్నారన్నారు. అనేక చోట్ల పేద ప్రజలను బెదిరించి అణిచివేసి వాళ్ల భూముల్ని లాక్కొని ఫార్మా కంపెనీలకు, కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు తహతహలాడుతున్నారని పేర్కొన్నారు. హైడ్రా పేరుతో ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, లగచర్లలో రైతుల నిరసనని లెక్క చేయలేదన్నారు.

మండలాల ప్రకటన మాటేమిటీ..
నారాయణపేట నియోజకవర్గంలో ఎన్నికల హామీలో భాగంగా రేవంత్‌రెడ్డి కోటకొండ, గార్లపాడు, కానుకుర్తిని అధికారంలోకి రాగానే మండలాలుగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తవుతున్న మండలాల సంగతే ఊసెత్తడం లేదన్నారు. జిల్లా కేంద్రంలో చిట్టెం నర్సిరెడ్డి కాలనీ వాసులకు, మైనార్టీ కాలనీ వాసులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పినా నేటికీ అది అమలుకు నోచుకోలేదన్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి నారాయణపేట జిల్లాకు మూడు లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాస్ లైన్ పార్టీ రాష్ట్ర నాయకులు కేజీ రామచందర్, హన్మేష్, జిల్లా కార్యదర్శి బి రాము, డివిజన్ కార్యదర్శి కె కాశీనాథ్, జిల్లా నాయకులు బి. యాదగిరి, జయ, రాము, టౌన్ కార్యదర్శి కెంచి నారాయణ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ
దామరగిద్ద: మండలంలోని ఉడ్మల్‌గిద్దలో పీడీఎస్‌యూ పీవైఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ విగ్రహాన్ని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. పేదలు సంపద సృష్టిస్తే పెత్తందారులు అనుభవిస్తున్నారని, ఆ సంపద పేదలకు అందేవరకు పోరాటం చేయాలన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాలతో పెట్టుబడి దారి వ్యవస్థను అవలంభిస్తుందన్నారు. దేశం, రాష్ట్రంలో ప్రభుత్వాలు పెత్తందారి విధానాలకు స్వస్తి పలికి పేదలను పట్టించుకోవాలన్నారు. సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి రాంచందర్ మాట్లాడుతూ దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా పోరాడే యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కృష్ణ, రాము, తాయప్ప, కాశీనాథ్, ప్రదీప్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి పుర అభివృద్ధికి రూ.353 కోట్లు

- జీఓ విడుదల చేసిన రాష్ట్ర మున్సిపల్ శాఖ



కోస్గి మున్సిపల్ కార్యాలయం

కోస్గి: కొడంగల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కోస్గి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.353.34 కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర మున్సిపల్ శాఖ జీఓ విడుదల చేసింది. గతంలోనే మున్సిపల్ అభివృద్ధికి సంబంధించి హైద్రాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ ద్వారా సమగ్ర అభివృద్ధికి కావాల్సిన నిధులు, చేపట్టే పనులపై డీపీఆర్ తయారు చేయించిన రేవంత్ సర్కార్ దాని ఆధారంగా నిధులు మంజూరు చేసింది. ఈ నిధులను రెండు ప్యాకేజీలుగా విభజించి అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించేలా కలెక్టర్‌తోపాటు కడా చైర్మన్‌కు ఆదేశాలు సైతం జారీ చేశారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో మొదటి ప్యాకేజీ కింద రూ.254.45 కోట్లతో అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. మొదటి ప్యాకేజీలో తాగునీటి సరఫరాకు రూ.8.35 కోట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కోసం రూ.145.81 కోట్లు, స్టోమ్ వాటర్ డ్రైనేజీ కోసం రూ.71.04 కోట్లు, రెజువనేషన్ వాటర్ బాడీస్ కోసం రూ.18.77 కోట్లు, సోలిడ్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్ కోసం రూ.10.48 కోట్లు మంజూరు చేశారు. రెండో ప్యాకేజీ కింద రోడ్లు, చౌరస్తాలు, స్వాగత బోర్డుల ఏర్పాటు కోసం రూ.98.89 కోట్లు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేయడంపై మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, నాయకులు అన్న కిష్టప్పతోపాటు కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

నారాయణపేట: ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి సత్వరమే వాటిని పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ బేన్ షాలం అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరిమా నరులతో కలిసి అదనపు కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి ఫిర్యాదుదారులు తమ సమస్యలను అధికారులకు విన్నవిస్తూ 20 అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ రాంచందర్, కలెక్టరేట్ ఏఓ జయసుధ పాల్గొన్నారు.

6 వినతులు..: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు. సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌లో 6 వినతులు వచ్చాయి.



నిర్వహణకు నీళ్లొదిలారు

కేఎల్ఐ కాల్వల మరమ్మతు మరచిన అధికారులు

- చెట్లు పెరిగి.. కోతలకు గురై దెబ్బతింటున్న వైనం
- తాజాగా వెల్దండ మండలంలో మళ్లీ తెగిన కేఎల్ఐ కాల్వ
- పంటలు దెబ్బతిని నష్టపోతున్న రైతాంగం
- నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలో నిత్యకృత్యమైన పరిస్థితులు



వెల్దండ శివారులో తెగిన కేఎల్ఐ కాల్వ (ఫైల్)

సాక్షి, నాగర్‌కర్నూల్: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన సాగునీటి కాల్వల పరిస్థితి అధ్వానంగా తయారైంది. కేఎల్ఐ ఎత్తిపోతల పథకం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 20 ఏళ్లుగా కాల్వల మరమ్మతుకు నోచుకోవడం లేదు. సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులు కనీసం కాల్వల నిర్వహణ సైతం చేపట్టడం లేదు. కేఎల్ఐ కాల్వల నిర్వహణ లేక, మరమ్మతుకు నోచుకోక అన్నిచోట్ల కాల్వలు బలహీనంగా మారిపోయాయి. దీంతో చిన్నపాటి వరదలకే కాల్వల కట్టలు తెగిపోతున్నాయి. కాల్వల నీరంతా రైతుల పంట పొలాలను ముంచెత్తుతోంది. దీంతో ఆరుగాలం కష్టించి పండించిన పంట క్షణాల్లోనే నీటిపాలవుతోందని బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలోని డీ–82 కాల్వకు మళ్లీ గండిపడి తెగిపోయింది. ఏటా తరుచుగా ఇదే ప్రాంతంలో గండి పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

లైనింగ్ లేక తిప్పలు..
కేఎల్ఐ కాల్వలకు తరుచుగా గండ్లు పడటానికి, కాల్వల కట్టలు కోతకు గురవడానికి లైనింగ్ చేపట్టకపోవడమే ప్రధాన కారణమని రైతులు చెబుతున్నారు. కాల్వలకు ఇరువైపులా సిమెంట్ లైనింగ్ చేపట్టకపోవడంతో తరుచుగా కోతలకు గురవుతున్నాయి. కేవలం ఎల్లూరు నుంచి సింగోటం వరకు మాత్రమే కేఎల్ఐ ప్రధాన కాల్వకు లైనింగ్ పనులు చేసి ఆ తర్వాత కాల్వల నిర్వహణ గాలికి వదిలేశారు. ప్రభుత్వం దృష్టిసారించి కేఎల్ఐ కాల్వలకు మరమ్మతు చేపట్టడంతోపాటు లైనింగ్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

కాల్వల పొడవునా గండ్లు
ఇటీవల కురిసిన వర్షాల సమయంలో కేఎల్ఐ కాల్వల పొడవునా పలుచోట్ల గండ్లు పడి ఇప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల పరిధిలో చాలాచోట్ల కాల్వలు కోతకు గురయ్యాయి. ఒక్క కల్వకుర్తి మండలంలోనే ఐదారు చోట్ల కాల్వకు గండిపడటంతో ఈసారి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి మండలం తోటపల్లి, వెంకటాపూర్, తిమ్మరాసిపల్లి, నెల్లికట్ల గ్రామాల సమీపంలో కేఎల్ఐ కాల్వకు గండ్లు పడి పంట పొలాలు నీటిలో మునిగాయి. వానాకాలంలో కురిసిన వర్షాలకు వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని కేఎల్ఐ కాల్వలతోపాటు భీమా కాల్వకు పలుచోట్ల గండి పడటంతో రైతులు పెద్దఎత్తున నష్టపోయారు. దావాజీపల్లి, బండపల్లి, షాగాపూర్, జమ్మాపూర్, మందాపూర్, బుసిరెడ్డిపల్లి గ్రామాల సమీపంలో కాల్వలకు గండి పడగా రైతుల పొలాలు నీటిలో కొట్టుకుపోయాయి. రేవల్లి మండల కేంద్రం సమీపంలోని డీ–5 లింక్ కెనాల్ తెగడంతో పంట పొలాలు నీటిలో మునిగాయి. వీటికి సంబంధించి ఎక్కడా నష్టపరిహారం అందలేదని రైతులు ఆరోపించారు.

మరమ్మతుకు నోచుకోక..
కేఎల్ఐ కాల్వల నిర్మాణం 2005లో చేపట్టగా.. అప్పటి నుంచి ఇప్పటివరకు కనీసం మరమ్మతు, నిర్వహణకు నోచుకోవడం లేదు. సుమారు పదేళ్లుగా కాల్వల పరిస్థితిని అధికారులు గాలికి వదిలేశారు. ప్రతిసారి వేసవి కాలంలో కాల్వలకు మరమ్మతు చేపట్టి, కట్టలను పటిష్టం చేయాల్సి ఉండగా, గడిచిన పదేళ్లలో ఒక్కసారి కూడా వాటివైపు కన్నెత్తి చూడలేదు. కేఎల్ఐ కింద కేవలం చెరువులు, కుంటలు నింపడం, ఉన్న కొద్దిపాటి కాల్వలకు సాగునీరందించేందుకే అధికారులు పరిమితమవుతున్నారు. పంపుహౌస్‌ల్లో కాలిపోయిన మోటార్లకు సైతం మరమ్మతు చేయకపోవడంతో సరైన స్థాయిలో పంపింగ్ చేపట్టక చివరి ఆయకట్టుకు సాగునీరు అందని దుస్థితి దాపురించింది.

పట్టించుకోవడం లేదు..



కేఎల్ఐ కాల్వలకు మరమ్మతు చేసే ప్రక్రియను అధికారులు మరిచిపోయారు. వెల్దండ మండలంలోని డీ–82 కాల్వ ఇప్పటికే నాలుగు సార్లు తెగిపోయింది. ఏటా గండిపడిన చోటే మళ్లీ తెగుతోంది. అధికారులకు ఎన్నిసార్లు అభ్యర్థించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టిసారించి కాల్వలను పటిష్టం చేయాలి. – జంగయ్య, రైతు, చొక్కన్నపల్లి, వెల్దండ మండలం

ప్రతిపాదనలు పంపించాం..
ఈసారి వర్షాలతోపాటు వరద నీరు ఎక్కువ కావడంతో కేఎల్ఐ కాల్వలకు అక్కడక్కడా గండ్లు పడ్డాయి. వెంటనే గుర్తించి కాల్వలకు గండిపడిన చోట్ల అడ్డుకట్ట వేశాం. త్వరలోనే కాల్వలకు మరమ్మతు చేపడతాం. అలాగే కాల్వలకు పూర్తిస్థాయిలో లైనింగ్ చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.
– శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ దుర్మరణం



జడ్చర్ల: ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన సోమవారం మండలంలోని కిష్టారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. అంబటాపూర్ గ్రామానికి చెందిన తానం యాదయ్య (45) తన ట్రాక్టర్‌ను నడుపుకుంటూ వెళ్తుండగా రాయికుంట వాగు సమీపంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ కింద పడిన డ్రైవర్ యాదయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. యాదయ్యకు భార్య బాలమణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య పరామర్శించారు.

లారీ ఢీకొని వ్యక్తి..

మానవపాడు: రోడ్డు దాటుతున్న సమయంలో లారీ ఢీకొట్టడడంతో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన సోమవారం కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. మానవపాడు మండల కేంద్రానికి చెందిన నారాయణచారి (54) వ్యక్తిగత పనుల నిమిత్తం కర్నూల్ జిల్లాకు వెళ్లాడు. పనులు ముగించుకొని మానవపాడుకు తిరుగు ప్రయాణంలో కర్నూల్‌లోని బళ్లారి చౌరస్తాలో రోడ్డు దాటుతున్న క్రమంలో లారీ వేగంగా వచ్చి అతన్ని ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య నీలావతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

గద్వాల క్రైం: గుర్తు తెలియని రైలుకింద పడి ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం గద్వాల పట్టణ శివారులో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ అశోక్‌కుమార్ కథనం మేరకు.. గట్టు మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన నాగరాజు(36) కొన్ని రోజులుగా తీవ్రంగా ఆరోగ్య సమస్యలు చోటు చేసుకున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది ఉదయం గద్వాల–హైదరాబాద్‌కు వెళ్లే గుర్తుతెలియని రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి తిప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఇద్దరు మైనర్లపై కేసు నమోదు

లింగాల: మండలంలోని దారారం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోడేరుకు చెందిన కురువ మల్లయ్య మృతి చెందాడు. అతడి మృతికి కారకులైన ఇద్దరు మైనర్లు సురేష్, అరుణ్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఇద్దరు మైనర్లు లింగాల నుంచి దారారం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో దారారం నుంచి లింగాలకు వస్తున్న మల్లయ్య అనే వ్యక్తి వస్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో మల్లయ్య మరణించాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అవినీతికి అడ్డుకట్ట పడేనా?



వివిధ ప్రభుత్వ శాఖల్లో పని జరగాలంటే చెయ్యి తడపాల్సిందే!

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న అవినీతి
- గతంతో పోలిస్తే అధికమైన ఏసీబీ కేసులు
- ఈ ఏడాది లంచం తీసుకుంటూ పట్టుబడిన 15 మంది ప్రభుత్వ ఉద్యోగులు
- నేటి నుంచి 9వ తేదీ వరకు అవినీతి నిరోధకశాఖ వారోత్సవాలు

మహబూబ్‌నగర్ క్రైం: వివిధ ప్రభుత్వ శాఖల్లో లంచం లేనిదే పని జరగడం లేదు. ప్రజలకు అవసరమైన పనులను చట్ట ప్రకారం చేయకుండా లంచం కోసం కొందరు అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏసీబీకి పట్టుబడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను పరిశీలిస్తే.. అవినీతి పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. నెలనెలా జీతం, అలవెన్సులు వస్తున్నా.. కొందరు అధికారులు సంతృప్తి చెందట్లేదు. ప్రజలకు చట్ట ప్రకారం చేయాల్సిన పనులకు ధరలు నిర్ణయిస్తూ ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. ఇవ్వకుంటే ముప్పుతిప్పలు పెడుతూ.. మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు. అవినీతికి ఎక్కువగా పాల్పడుతున్న ప్రభుత్వ శాఖల్లో ప్రముఖంగా రెవెన్యూ, విద్యుత్, పోలీస్ శాఖలు మొదటి మూడు వరసలో ఉన్నాయి. అధిక మొత్తంలో సంపాదించాలనే ఆలోచనతో కార్యాలయాలకు వివిధ పనుల మీద వచ్చే సమాన్య ప్రజల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ఈ క్రమంలో అవినీతి నిర్మూలనకు ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. అందులో భాగంగా మంగళవారం నుంచి 9వ తేదీ వరకు అవినీతి నిరోధక శాఖ వారోత్సవాలు నిర్వహించనున్నారు.

- రాష్ట్రంలో అవినీతి కేసుల నమోదులో పాలమూరు టాప్ వన్‌లో ఉంది. ఈ ఏడాది నమోదైన కేసుల ప్రకారం మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలు పోటీ పడ్డాయి. అయితే పాలమూరులో 15 కేసులతో పాటు రెండు ఆకస్మిక తనిఖీలు ఉండటం వల్ల మొదటి స్థానంలో ఉంది. ఈ లెక్కల ప్రకారం పరిశీలిస్తే.. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పైకం ఇవ్వనిదే పని జరగదు అనేది స్పష్టమవుతోంది.

నేరం రుజువైతే ఉద్యోగం పోయినట్లే..

లంచం తీసుకుంటూ దొరికిన ఉద్యోగులను ఏసీబీ అధికారులు 24 గంటల్లో కోర్టులో హాజరుపరుస్తారు. చాలా వరకు బెయిల్ దొరకదు. సదరు ఉద్యోగిని కోర్టు రిమాండ్‌కు తరలిస్తుంది. కోర్టులో నేరం రుజువు అయితే ఆరేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుంది. అవినీతి ఉద్యోగులు, అధికారుల ఆస్తులను కోర్టు స్వాధీనం చేసుకుంటుంది. నేరం రుజువు అయితే వాటిని ప్రభుత్వం జప్తు చేస్తుంది. లంచం తీసుకుంటూ పట్టుబడిన వారు జైలులో ఉండాల్సి వస్తుంది. వారిని ప్రభుత్వం సస్పెండ్ చేస్తోంది. పెండింగ్ విచారణ పేరుతో ఉద్యోగంలోకి తీసుకున్నా.. కేసు పూర్తయే వరకు ఇబ్బందులు తప్పవు. పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, ఇతర సౌకర్యాలను కోల్పోతారు. మానసిక వేదనకు గురికావాల్సి వస్తోంది. సమాజంలో పలు అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. చివరికి కోర్టులో నేరం రుజువైతే జైలుశిక్ష పడటంతో పాటు ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తారు.

కేసుల నమోదు ఇలా..

■ ప్రభుత్వ ఉద్యోగులు చట్టం ప్రకారం చేయాల్సిన పనుల విషయంలో లంచం అడగడం.. తీసుకోవడం నేరం. దీనిపై సెక్షన్–7 ప్రకారం కేసు నమోదు చేస్తారు.

■ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉంటే సెక్షన్–13 (1) (సీ) ప్రకారం చర్యలు తీసుకుంటారు.

■ విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినా సెక్షన్–13 (1), (ఏ నుంచి డీ) వరకు అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం కేసులు పెడతారు.

■ అక్రమ ఆస్తి కూడబెట్టడంలో సహకరించిన బంధువులు, స్నేహితుల మీద ఐపీసీ 109 సెక్షన్ ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

2015 నుంచి 2024 వరకు నమోదైన కేసులు..

ఏడాది	2015	2016	2017	2018	2019	2020	2021	2022	2023	2024
కేసులు	18	7	5	5	11	10	9	6	7	15



వివరాలు సేకరిస్తున్న ఏసీబీ అధికారులు (ఫైల్)

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి..

ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల్లో చాలా చైతన్యం వచ్చింది. ఫిర్యాదులు అధికంగా రావడంతోనే ఏసీబీ కేసులు పెరుగుతున్నాయి. ప్రజలకు ఏసీబీపై నమ్మకం ఉండటం వల్లే సంప్రదిస్తున్నారు. లంచం తీసుకున్న వారిపై ఫిర్యాదు చేస్తే తప్పక యాక్షన్ ఉంటుంది. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు ఉచితంగా పనులు చేయాలి. ఎవరైనా లంచం అడిగితే నేరుగా ఏసీబీ అధికారులను కలిసి లేదా 1064 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ప్రభుత్వ శాఖలో సిటిజన్ చార్ట్‌తో పాటు ఏ అధికారి ఏ విధులు నిర్వహిస్తారనే దానిపై బోర్డు ఏర్పాటు చేసే విధంగా చూస్తున్నాం. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ చార్టర్ కన్పించాలి. తొందరగా పనులు చేయించుకోవాలనే ఉద్దేశంతో లంచం ఇవ్వడం.. తీసుకోవడం రెండు నేరం.

– ఎస్‌పీకే జిలానీ, సీఐ, ఏసీబీ

బైక్ దొంగల ముఠా ఆటకట్టు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

- ఆరుగురు అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు
- 35 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం: జోగుళాంబ గద్వాల జిల్లా పోలీసులు బైక్ దొంగల ముఠా ఆటకట్టించారు. ఈ మేరకు ఆరుగురు నిందితులను అరెస్టు చేసి.. 35 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలను సోమవారం ఎస్పీ శ్రీనివాసరావు ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన వడ్డె నరేంద్ర (గాంధీ చిన్నచింతలపేట్), నాగరాజు (చింతలపేట), వంశీ (సెకండ్ రైల్వేగేట్), రఫీ (నల్లకుంట), నవీన్, రాధాకృష్ణ (మదనాపురం), వహీద్, ఆదర్శ్ (కొత్తకోట) చెందిన ఎనిమిది మంది యువకులు ముఠాగా ఏర్పడి రెండు జిల్లాల్లో బైక్‌లను అపహరిస్తూ.. వాటిని తక్కువ ధరకు విక్రయించి.. వచ్చిన డబ్బులతో చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. అయితే గత నెల 28న గద్వాలలోని రాంనగర్ కాలనీకి చెందిన రేణుక అనే మహిళ స్కూటీని ఇంటి బయట ఆపగా సదరు నిందితులు అపహరించారు. అదే రోజు మహిళ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పలు ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచారు. సోమవారం తెల్లవారుజామున జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తుండగా వడ్డె నరేంద్ర రాగా తనిఖీ చేశారు. బైక్ పత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడన్నారు. నరేంద్ర ఇచ్చిన సమాచారంతో 35 బైక్‌లను స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్టు చేశామని, మరో ఇద్దరు వంశీ, రాధాకృష్ణ పరారీలో ఉన్నారని, వారిని కూడా తరలోనే అరెస్టు చేస్తామన్నారు. స్వాధీనం చేసుకున్న బైక్‌లను కోర్టు అనుమతితో బాధితులకు అప్పగిస్తామని చెప్పారు. ఆరుగురు నిందితులను గద్వాల కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. అయితే నిందితులంతా 20 ఏళ్లలోపు యువకులే కావడం గమనార్హం.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లు

సిబ్బందికి రివార్డులు..

బైక్ దొంగలను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఏఎస్పీ, డీఎస్పీ, సీఐల ఆధ్వర్యంలో పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్, సాంకేతిక విభాగ సిబ్బంది చంద్రయ్య, ఇస్మాయిల్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులను అందజేశారు. కేసు ఛేదనలో సిబ్బంది ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఇంత పెద్దమొత్తంలో బైక్‌లు రికవరీ కావడం అభినందనీయమన్నారు. సమావేశంలో ఏఎస్పీ గుణశేఖర్, సీఐలు శ్రీను, రవిబాబు, టాటబాబు, నాగేశ్వర్ రెడ్డి, ఎస్‌ఐలు కల్యాణ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీలో రాకపోకలు ప్రారంభం

- అధికసంఖ్యలో అటుగా వస్తున్న వాహనాలు

జడ్చర్ల టౌన్: పాతబజార్‌లో రైల్వేస్టేషన్ వద్ద నిర్మించిన ఆర్‌యూబీ స్వచ్ఛందంగా ప్రారంభమైంది. నిర్మాణ పనులు పూర్తయిన ఆర్‌యూబీని ఈనెల మొదటివారంలో ప్రారంభిస్తామని రైల్వేశాఖ అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. శనివారం పట్టణంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సిగ్నల్‌గడ్డపై ఎటుచూసినా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో కొందరు ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు ఆర్‌యూబీ నుంచి రాకపోకలు ప్రారంభించాయి. సిగ్నల్‌గడ్డపై ట్రాఫిక్ జాం కావటం, గౌడ ఫంక్షన్‌హాల్ వద్ద ఉన్న ఆర్‌యూబీ నుంచి రాకపోకలు సాగించినప్పటికీ వాహనాలు అధికంగా ఉన్నాయి. దీంతో ఆర్‌యూబీకి అడ్డుగా ఉన్న రేకులు వాహనదారులు తొలగించారు. అధికారికంగా ప్రారంభించకుండానే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పాతబజార్ నుంచి కొత్తబజార్ వెళ్లాల్సిన వారంతా ఆర్‌యూబీ నుంచే రాకపోకలు ప్రారంభించారు. ఆదివారం, సోమవారం పెద్దసంఖ్యలో ఆమార్గంలో వాహనాలు వెళ్లాయి. గౌడ ఫంక్షన్‌హాల్ వద్ద నిర్మించిన ఆర్‌యూబీ సైతం ఇదే తరహాలో ప్రారంభించకుండానే వాహనాల రాకపోకలు స్టార్ట్ అయిన విషయం తెలిసిందే.



ఆర్‌యూబీ నుంచి వస్తున్న వాహనాలు

కస్తూర్బాలో బాలిక అదృశ్యం

- విచారణ చేపట్టిన విద్యాధికారులు



తరగతి గదిలో విద్యార్థులను వివరాలు తెలుసుకుంటున్న విద్యాశాఖ అధికారులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం కస్తూర్బా పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. ఈ విషయం తెలిసిన వెంటనే ఉపాధ్యాయురాలు, సిబ్బంది స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రామన్‌గౌడ్ ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో పాఠశాలలో వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేశారు.

విచారణ చేపట్టిన జిల్లా విద్యాశాఖ అధికారులు..

సోమవారం జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జి డీఈఓ రాజశేఖర్ ఆధ్వర్యంలో పాఠశాలలో విచారణ చేపట్టారు. ఆదివారం సాయంత్రం పెంట్లవెల్లి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థిని తీసుకుపోవడానికి వేరేవాళ్లు వచ్చి, సొంత కుటుంబ సభ్యులమని నమ్మించి ఒక అబ్బాయి విద్యార్థినిని తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. పాఠశాలలోని పరిస్థితులు, ఉపాధ్యాయుల నివేదిక, విద్యార్థుల నివేదికను తీసుకొని కలెక్టర్‌కు వివరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీసీడీఓ శోభారాణి, ఎస్‌ఏఓ మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఓ సువర్ణ, ఎస్‌ఐ రామన్‌గౌడ్ ఉన్నారు.

వ్యక్తి మృతిపై లేబర్ అధికారికి ఫిర్యాదు



ఖిల్లాఘనపురం: గుంపు మేస్త్రీ తీసుకెళ్లిన ఓ వ్యక్తి మృతిపై సోమవారం వనపర్తి లేబర్ అధికారికి మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన వడ్డె ఓర్సు చెన్నయ్యను తాండూర్ మండలం రాఘపూర్ గ్రామానికి చెందిన గుంపు మేస్త్రీ వరికుప్పల కిష్టయ్య 45 రోజుల క్రితం పనికోసమని చెప్పి మహారాష్ట్రలోని కళ్యాణి ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఆదివారం ఉదయం ఆయన ఫోన్ చేసి చెన్నయ్య మృతి చెందినట్లు మృతుడి భార్య వెంకటమ్మకు ఫోన్‌చేసి చెప్పాడు. ఆమె కుటుంబ సభ్యులతో కలిసి వస్తున్నట్లు మేస్త్రీకి ఫోన్‌చేసి చెప్పారు. కానీ అప్పటికే పోస్టుమార్టం పూర్తయిందని గ్రామానికే మృతదేహాన్ని తీసుకొస్తున్నట్లు ఆయన చెప్పాడు. కుటుంబ సభ్యులు ఎవ్వరూ లేకుండా పోస్టుమార్టం ఎలా చేస్తారని ప్రశ్నించారు. మృతదేహాన్ని పంపుతున్నాం దహన కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలని, లేదంటే ఇక్కడే కరెంట్ మిషన్‌లో శవాన్ని దహనం చేస్తామని చెప్పాడు. ఈ విషయాలు విన్న కుటుంబ సభ్యులకు అనుమానం రావడంతో వనపర్తి లేబర్ అధికారి అందుబాటులో లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్ రఫీకి సోమవారం ఫిర్యాదు చేశారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొన్న లారీ

వ్యక్తి దుర్మరణం

- భార్యాపిల్లల కళ్లెదుటే ఘటన
- దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం



ఘటనా స్థలంలో ధ్వంసమైన లారీ, బస్సు

కృష్ణా: మండల సరిహద్దులోని కృష్ణా బ్రిడ్జి పక్కన సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. ఆదివారం అమావాస్య కావడంతో దేవసూగూర్ సూగురేశ్వర ఆలయానికి భక్తులు తరలివస్తుంటారు. అయితే సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు రాయచూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బస్సు దేవసూగూర్‌కు రాగా.. ఆ సమయంలో ఆలయానికి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో బస్సు ఎక్కారు. కాగా.. కండక్టర్ టికెట్ తీసుకునేందుకు గాను బ్రిడ్జి పక్కన బస్సును ఆపడంతో మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని టంకర గ్రామానికి చెందిన కటిక సురేష్(47) మూత్రవిసర్జన కోసం బస్సు దిగి ముందు నిలబడ్డాడు. ఇదే సమయంలో వెనక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొట్టడంతో బస్సు ముందుకు కదలగా.. సురేష్ టైరు కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో భార్య భారతి, కూతురు అక్కడే ఉన్నారు. వారి కళ్ల ఎదుటే భర్త విలవిలాడుతూ మృతిచెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదానికి కారణమైన లారీ బళ్లారి నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదంలో చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణా ఎస్‌ఐ ఎండీ నవీద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పసుపు అట్టలతో సమగ్ర సస్యరక్షణ



పంటలో ఏర్పాటుచేసిన పసుపు రంగు అట్ట

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: పంట సాగులో పురుగు మందు వినియోగం పెరిగింది. మన దేశంలో ప్రస్తుతం 150000 టన్నులకు పైగా వినియోగం అవుతున్నట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. సమగ్ర సస్యరక్షణ ద్వారా ఈ పురుగు మందుల వినియోగాన్ని తగ్గించొచ్చని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ రైతులకు సూచించారు. సస్యరక్షణకు సులభ పద్ధతులను వివరించారు.

పసుపు పచ్చ అట్టల పాత్ర..

టమాట, మిరప ఇతర పంటల్లో రసం పీల్చే పురుగుల తాకిడి అధికం. తెల్ల, పచ్చ దోమ, తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. తెల్ల దోమతో మిరప పంటకు జెమిని వైరస్, కుకుంబర్ మొజాయిక్ వైరస్ ఆశిస్తోంది. పంటకు తీవ్రమైన నష్టాన్ని కలుగజేస్తుంది. వీటిని అరికట్టడానికి సస్యరక్షణలో భాగంగా పసుపు రంగు అట్టలు ఏ రకమైన పురుగునైనా గుణం ఉంటుంది. ఈ పసుపు రంగు అట్టలను కట్టెలకు పెట్టి సాళ్ల వెంబడి క్రమ పద్ధతిలో అమర్చాలి. ఈ అట్టలకు జిగురు లేదా గ్రీసు పూస్తే ఈ జిగురుకు తెల్ల దోమ, పచ్చ దోమ, ఎర్ర నల్లి, తామర పురుగులు అంటుకోని చనిపోతాయి. ముడత తెగులు తగ్గిపోతుంది. రసాయనిక పురుగు మందులు వాడకుండా తక్కువ ఖర్చుతో రసం పీల్చే పురుగులను నియంత్రించే ఈ మ్యాజిక్ ప్లేట్లు ఎకరానికి 20నుంచి 30 వరకు అమర్చుకోవాలి. ఎకరాకు వెయ్యి వరకు ఖర్చయ్యే అవకాశం ఉంటుందని రైతులకు సూచించారు.

సమగ్ర సస్యరక్షణలో నాలుగు పద్ధతులు..

1. సాగు పద్ధతి
2. యాంత్రిక పద్ధతి
3. జీవ నియంత్రణ పద్ధతి
4. పర్యావరణ హిత క్రిమి సంహారక మందులు

యాంత్రిక పద్ధతులు సమగ్ర సస్యరక్షణతో కీలక పాత్ర పోషిస్తాయి.

- నారు మొక్కకు చివరులు తుంచి వేయుట
- చీడ పీడలు ఆశించి భాగాన్ని తుంచి వేయుట
- పక్షి స్థావరాలు ఏర్పాటు చేయుట
- దీపపు ఎరలు నెలకొల్పుట
- శత్రు గుడ్ల సముదాయాన్ని సేకరించి నాశనం చేయుట
- రాత్రి పూట గుడ్లపై మంటలు వేయుట
- పసుపు పచ్చ అట్టలు(జిగురు పూసిన) ఏర్పాటు చేసుకోనుట

పావుగంటలో ఇంటికి చేరతామనగా..

ఓఆర్‌ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

- అక్కాతమ్ముడిని కబళించిన మృత్యువు
- మరో నలుగురికి తీవ్ర గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్: మరో 15 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనుకున్న అక్కాతమ్ముడిని మృత్యువు కబళించింది. ఓఆర్‌ఆర్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయిపల్లె గ్రామానికి చెందిన ఎరగదిండ్ల మనోజ్ (25) అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని కుంట్లూర్‌కు చెందిన తన అక్క చల్లా పద్మ (31), బావ వెంకటేశ్, మేన కోడళ్లు గంగ, యమున, మేనల్లుడు చల్లా అర్జున్‌ను తీసుకుని సోమవారం ఉదయం వనపర్తి నుంచి కారులో కుంట్లూర్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో ఔటర్ రింగ్‌రోడ్డుపై కోహెడ –పెద్దఅంబర్‌పేట మార్గంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారుకు.. ముందు అతి వేగంగా వెళ్తున్న లారీని డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో కారు లారీని వెనుకవైపు నుంచి బలంగా ఢీకొట్టాడు. లారీలో కారు ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో మనోజ్‌తో పాటు పద్మ అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా వానిరి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.



లారీలో ఇరుక్కుపోయిన కారు

క్లుప్తంగా...

మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డికి వీడ్కోలు..

అమెరికా వెళ్లిపోతున్న బీఆర్‌ఎస్ నేత



వీడ్కోలు సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి, హరీశ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ భవన్ ఇన్‌చార్జిగా సుమా రు 24 ఏండ్ల పాటు పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ నేతలు సోమవారం తెలంగాణ భవన్‌లో వీడ్కోలు పలికా రు. మాజీ మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన జరి గిన వీడ్కోలు సమావేశంలో పలువురు నేతలు పార్టీకి శ్రీనివాస్‌రెడ్డి అందించిన సేవలను గు ర్తు చేసుకున్నారు. శేష జీవితాన్ని అమెరికాలో గడిపేందుకు వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డిని తెలంగాణ ఉద్యమ అనుభవాలను క్రోడీకరించి పుస్త కం రాయాల్సిందిగా నాయకులు కోరారు. తె లంగాణ ఉద్యమంలో శ్రీనివాస్‌రెడ్డి అనేక కీల క ఘట్టాలకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్నారన్నారు. మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పద్మారావు గౌడ్, ఎమ్మెల్సీలు మధుసూదనా చారి తదితరులు శ్రీనివాస్‌రెడ్డితో తమకున్న అనుబంధాన్ని వివరించారు. కాగా, తనకు మంచి గుర్తింపు ఇచ్చిన పార్టీ అధినేత కేసీఆర్‌కు మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పన్ను వసూళ్లలో 15 శాతం వృద్ధి

ఐటీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పన్ను వసూళ్లలో తెలంగాణ మంచి వృద్ధిరేటు చూపుతోందని, గతేడాదితో పోలిస్తే 15 శాతం వృద్ధి సాధించిందని ఆదాయ పన్ను శాఖ తెలంగాణ, ఏపీల ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత తెలిపారు. తెలంగాణ, ఏపీ కలిపి ఈ ఏడాది పన్ను వసూళ్ల లక్ష్యం రూ.1,21,000 కోట్లు కాగా, ఇందులో ఇప్పటివరకు రూ.59,000 కోట్ల మార్కును చేరుకున్నామని చెప్పారు. పూర్తి లక్ష్యాన్ని చేరుకుంటామనే ఆశా భావంతో ఉన్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) సోమవారం ఉదయం ఆదాయపు పన్నుపై నిర్వహించిన సమావేశంలో మధుస్మిత మాట్లాడారు. రెండు రాష్ట్రాల్లో కలిపి రూ. 2 లక్షల కోట్ల పన్ను పెండింగ్‌లో ఉందని తెలిపారు. వ్యాపారాన్ని సులభతరం చేయడం అనేది భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆదా యపు పన్ను శాఖ నినాదం అని ఆమె చెప్పారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్య

- మరో ఘటనలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



నారాయణ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పోచారం/నిజాంపేట/బీబీనగర్/భానుపురి (సూర్యాపేట): వేర్వేరు కాలేజీల్లో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మరో ఘటనలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.

అన్నోజిగూడ నారాయణ కళాశాలలో...



తనుష్‌నాయక్ (ఫైల్ ఫొటో)

బీబీనగర్ మండలంలోని పెద్దపలుగు తండాకు చెందిన బానోతు తనుష్‌నాయక్ (16) తల్లిదండ్రులు నగరానికి వలస వచ్చి కుషాయిగూడలోని చక్రీపురంలో ఉంటున్నారు. అన్నోజిగూడలోని నారాయణ జూనియర్ కళాశాలలో తనుష్‌ను ఇంటర్ ఫస్టియర్(ఎంపీసీ)లో చేర్పించారు. సోమవారం సాయంత్రం హాస్టల్ బాత్‌రూమ్‌లోకి వెళ్లిన తనుష్ ఎంత సేపటికీ బయటకు రాలేదు. దీంతో తోటి విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది తలుపులు పగుల గొట్టి చూడగా..తనుష్ ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో నేరుగా గాంధీ ఆస్పత్రికి తరలించారు. తనుష్‌కు ఫిట్స్ వచ్చాయని కళాశాల నిర్వాహకులు చెబుతుండగా..అధ్యాపకుల ఒత్తిడి కారణంగానే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు.

ఎస్‌ఎస్‌ఆర్ కళాశాలలో...

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం చిన్నతడం గ్రామానికి చెందిన ప్రజ్ఞారెడ్డి ప్రగతినగర్‌లోని ఎస్‌ఎస్‌ఆర్ ఇంపల్స్ ఐఐటీ గర్ల్స్ క్యాంపస్‌లో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతూ కళాశాలకు చెందిన హాస్టల్‌లో ఉంటోంది. సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో ప్రజ్ఞారెడ్డి తాను ఉంటున్న హాస్టల్ గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే విద్యార్థిని మృతి చెందిన విషయాన్ని దాచి పెట్టిన కళాశాల యాజమాన్యం హుటాహుటిన మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించింది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకుందా లేక ఇతరత్రా కారణాలేమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఎస్‌ఎస్‌ఆర్ ఇంపల్స్ ఐఐటీ క్యాంపస్‌కు ఇంటర్ బోర్డు అనుమతి లేదని సమాచారం.

ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో....

సూర్యాపేట జిల్లా కోదాడ స్నేహ నర్సింగ్ కళాశాలలో అసోం రాష్ట్రానికి చెందిన నర్గిస్ పర్వీన్ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజులుగా ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యం ఒత్తిడి చేయడంతో బుధవారం రాత్రి కాలేజీ హాస్టల్‌లో శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను సూర్యాపేట ఆస్పత్రిలో చేర్పించగా..కోలుకుంది. మళ్లీ ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యం డిమాండ్ చేయడంతో సోమవారం గ్రీవెన్స్‌డేలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు కాలేజీకి చెందిన పలువురు విద్యార్థులతో కలిసి ఆమె సూర్యాపేటలోని కలెక్టరేట్‌కు వచ్చింది. వారంతా కలిసి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఆ తర్వాత కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో బాధిత విద్యార్థిని తన వెంట తెచ్చుకున్న శానిటైజర్ తాగి మళ్లీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో వెంటనే కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది ఆమెను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నర్గిస్ పర్వీన్‌ను కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పరామర్శించారు.

రాష్ట్ర వన్యప్రాణి బోర్డు పునర్వ్యవస్థీకరణ

సభ్యులుగా పలువురు ఎమ్మెల్యేలు, స్వచ్ఛంద సంస్థలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వన్యప్రాణి బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. మూడేళ్లపాటు కొనసాగనున్న ఈ బోర్డు... ఏడాదికి కనీసం రెండు సార్లు సమావేశం కావాల్సి ఉంటుంది. రాష్ట్రంలో రక్షిత ప్రాంతాల ప్రకటన, వన్యప్రాణుల సంరక్షణ, ఏవైనా ప్రత్యేకతలున్న మొక్కల పరిరక్షణ, ఏదైనా షెడ్యూల్‌కు సవరణలు, అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు, ఇతర ప్రజల అవసరాలకు తగ్గట్టు గా తగిన చర్యలు, రాష్ట్ర ప్రభుత్వం చేసే సూచనలు వంటి వాటిని ఈ బోర్డు పరిశీలించనుంది. తదను గుణంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయా అంశాలపై సలహాలు, సూచనలు ఇవ్వనుంది. బోర్డు చైర్మన్‌గా ముఖ్యమంత్రి, వైస్ చైర్‌పర్సన్‌గా అటవీ, పర్యావ రణశాఖ మంత్రి కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ బోర్డులో సభ్యులుగా... ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు (ఖానాపూర్), సీహెచ్ వంశీకృష్ణ (అచ్చంపేట) మురళీనాయక్ (మహబూబాబాద్)లను నియమించారు. వన్యప్రాణులతో ముడిపడిన రంగాలు, కార్యకలాపాల్లో నిమగ్నమైన స్వచ్ఛంద సంస్థల నుంచి... డబ్ల్యూడబ్ల్యూఎఫ్ హైదరాబాద్ ఆఫీస్ స్టేట్ డైరెక్టర్ ఫరీదా తంపాల్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ సంస్థాపక కార్యదర్శి ఇమ్రాన్ సిద్దిఖి, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి అవినాష్ విశ్వనాథన్‌లు సభ్యులుగా నియమి తులయ్యారు. పర్యావరణ వేత్తలు... లాకోన్స్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.ఉమాపతి, విశ్రాంత ఐఎఫ్‌ఎస్ ఎంఏ వహీద్, నెహ్రూ జూపార్క్ వెటర్నరీ కన్సల్టెంట్ డా.నవీన్‌కుమార్, ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.వాసుదేవ రావు, ఈ కేటగిరీలో ఇంకా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు (పినపాక), రాందాస్ మాలావత్ (వైరా)లను సభ్యులుగా నియమించారు. ఇంకా... ఇతర సభ్యులుగా అటవీ, గిరిజన, ఇతర శాఖల ప్రతినిధులు, పీసీసీఎఫ్ నియమితులయ్యారు. ఈ బోర్డు సభ్యకార్యదర్శిగా చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ (అరణ్యభవన్) వ్యవహరిస్తారు. సోమవారం ఈ మేరకు అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీచేశారు.

తేలని 'విభజన' చర్చలు!

- తెలంగాణ, ఏపీ సీఎస్‌ల ఆధ్వర్యంలోని కమిటీ భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన అంశాలపై జరిగిన తెలంగాణ, ఏపీ సీఎస్‌ల ఆధ్వర్యంలోని కమిటీ భేటీ ఏమీ తేల్చకుండానే ముగిసింది. కొన్ని అంశాలపై ఏకాభిప్రాయం వ్యక్తమైనా ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు. వచ్చే సమావేశం నాటికి ఆయా అంశాలపై నిర్దిష్టమైన ప్రతిపాదనలతో రావాలని తీర్మానించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ జరిగి పదిన్నరేళ్లు అవుతున్నా చాలా సమస్యలు అలాగే ఉండిపోయిన విషయం తెలిసిందే. అలా అపరిష్కృతంగా ఉన్న అంశాలపై చర్చించేందుకు... ఇరు రాష్ట్రాల సీఎస్‌ల ఆధ్వర్యంలోని అధికారుల కమిటీ సోమవారం ఏపీలోని మంగళగిరిలో ఉన్న ఏపీఐఐసీ కార్యాలయంలో సమావేశమైంది.

15 అంశాలపై చర్చించినా..

సుమారు రెండు గంటల పాటు జరిగిన కమిటీ భేటీలో... ఇరు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న 15 అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్టు చర్చల్లో పాల్గొన్న తెలంగాణ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. విభజన జరిగి పదేళ్లు పూర్తయినందున త్వరగా సమస్యలను పరిష్కరించుకోవాలని ఇరు రాష్ట్రాల సీఎస్‌లు అభిప్రాయపడ్డారని తెలిపారు. ఈ ఏడాది జూలై 6న ఇరు రాష్ట్రాల సీఎంలు సమావేశమై జరిపిన చర్చలకు అనుగుణంగా సమస్యలను పరిష్కరించుకోవాలని మరోసారి నిర్ణయించినట్టు వివరించారు. ఈ మేరకు వచ్చే సమావేశం నాటికి ఈరోజు చర్చించిన అంశాలపై నిర్దిష్ట ప్రతిపాదనలతో రావాలని తీర్మానించినట్టు తెలిపారు. ఇందుకోసం ఆయా శాఖల అధికారులు ముందుగా సమావేశమై చర్చించుకోవాలని, పరిష్కారానికి అవసరమైన వివరాలు సేకరించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. త్వరలో కమిటీ మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్టు తెలిపారు.

మంత్రుల కమిటీకే 'విద్యుత్'అంశం

ఇక రెండు రాష్ట్రాల మధ్య విద్యుత్ కొనుగోళ్లు, విక్రయాల అంశంలో నెలకొన్న వివాదాన్ని మంత్రుల కమిటీకి వదిలేయాలని సీఎస్‌ల కమిటీ నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే రూ.861 కోట్ల లేబర్ సెస్ నిధులను పంపిణీ చేసుకోవాలని, ఉద్యోగుల పరస్పర బదిలీలపై విస్తృతంగా చర్చించాలని ఏకాభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. ఈ అంశాలపై సీఎంలకు నివేదించిన తర్వాత తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. ఈ సమావేశంలో తెలంగాణ సీఎస్ శాంతికుమారి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ రిజ్వీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, ఏపీ సీఎస్ నీరబ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'మేడిగడ్డ' ఎప్పుడు దెబ్బతింది?

- కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లను డ్యామ్‌లుగా ఏ ప్రాతిపదికన పరిగణించారు
- 2019లో బరాజ్‌లు పూర్తయితే 2021లో వాటిని గుర్తించడం వెనక అంతర్యమేంటి?
- రాష్ట్ర డ్యామ్‌ల భద్రత సంస్థ మాజీ ఎస్‌ఈ మురళీకృష్ణకు పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నలు
- ఆయన అమెరికాలో ఉండటంతో వర్చువల్‌గా సాగిన క్రాస్ ఎగ్జామినేషన్

సాక్షి, హైదరాబాద్: 'వరదనీటి మళ్లింపు కోసం నిర్మించే బరాజ్‌లను నీటినిల్వ డ్యామ్‌లుగా ఏ ప్రాతిపదికన పరిగణించారు? 2019లో బరాజ్‌లు పూర్తయితే 2021లో వచ్చిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్ కింద 2023 జూలైలో కాళేశ్వరం బరాజ్‌లను డ్యామ్ లుగా గుర్తించడం వెనక అంతర్యం ఏమిటి?' అని రాష్ట్ర డ్యామ్‌ల భద్రత సంస్థ (ఎస్డీఎస్ఓ) మాజీ ఎస్‌ఈ మురళీకృష్ణను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సోమవారం అమెరికాలో ఉన్న మురళీకృష్ణను వర్చువల్‌గా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.

చట్టంలో ఉన్నందునే పరిగణించాం..

'డ్యామ్‌ల రక్షణ చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది? మీరు అఫిడవిట్లో పేర్కొన్నదంతా వాస్తవమేనా? మీ బాధ్యతలేంటి?' అని కమిషన్ మురళీకృష్ణను ప్రశ్నించింది. అందుకు ఆయన బదులిస్తూ 2021 డిసెంబర్ 30న నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్‌ను నోటిఫై చేశారని పేర్కొన్నారు. 15 మీటర్ల ఎత్తు కలిగి, నీటిని నిల్వ చేసే జలాశయాలతోపాటు 10 మీటర్లకు మించి ఎత్తున్న చెక్ డ్యామ్‌లను కూడా డ్యామ్‌లుగా పరిగణించాలని చట్టంలో ఉందని మురళీకృష్ణ తెలియజేశారు. దీనిపై కమిషన్ స్పందిస్తూ 'నీటిని మళ్లించడానికే బరాజ్‌లు కడతారు.. మరి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను డ్యామ్‌లుగా ఎలా పరిగణించారు? అని మళ్లీ ప్రశ్నించింది. చట్ట ప్రకారం స్పెసిఫైడ్ డ్యామ్‌లుగా బరాజ్‌లను నోటిఫై చేశారని మురళీకృష్ణ వివరించారు. డ్యామ్‌ల రక్షణ చట్టం అమలు కోసం క్షేత్రస్థాయిలో అధికారులతో చర్చించామని.. ఆయా డ్యామ్‌లను సమగ్రంగా పరిశీలించి నోటిఫై చేయించామని తెలిపారు. బరాజ్‌లు ఎప్పుడు పూర్తయ్యాయని కమిషన్ ప్రశ్నించగా 2023లో స్పెసిఫైడ్ డ్యామ్‌లుగా నోటిఫై చేశామన్నారు. 2021లో చట్టం వస్తే 2019లోనే బరాజ్ పూర్తవడం వాస్తవమా? కాదా? అని కమిషన్ అడగ్గా వాస్తవమేనని చెప్పారు. పదేపదే విజ్ఞప్తుల అనంతరం స్పెసిఫైడ్ డ్యామ్‌ల జాబితాలో బరాజ్‌లను చేర్చారని బదులిచ్చారు. 2019లో మేడిగడ్డలో వరదలు వచ్చాయని, తొలుత సుందిళ్ల, అన్నారంలో బుంగలు ఏర్పడ్డాయని, ఆ తర్వాత మేడిగడ్డ దెబ్బతిందని మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అయితే బరాజ్‌ల అధికారులు ఈ విషయాన్ని నివేదించలేదని మురళీకృష్ణ వెల్లడించారు.

రెండో వారంలో మళ్లీ విచారణ

నాలుగో విడత క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి చేసిన జస్టిస్ చంద్రఘోష్.. మంగళవారం సాయంత్రం కోల్‌కతా తిరిగి వెళ్లనున్నారు. అనంతరం రెండో వారంలో తిరిగి హైదరాబాద్ వచ్చి ఐదో దఫా విచారణలో ఈఎన్సీలు, మాజీ ఈఎన్సీలను ప్రశ్నించనున్నారు. ఆ తర్వాత ఐఏఎస్‌లను విచారించే అవకాశాలున్నాయి.

జనరల్ ఆస్పత్రిలో మైత్రి క్లినిక్ ప్రారంభం



క్లినిక్ ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ట్రాన్స్‌జెండర్

పాలమూరు: మైత్రి క్లినిక్ ద్వారా ట్రాన్స్‌జెండర్లకు కౌన్సెలింగ్, ఆరోగ్య, సాధారణ ఆరోగ్య సేవలు అందుతాయని అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన మైత్రి క్లినిక్(ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను) సోమవారం ఓ ట్రాన్స్ జెండర్‌తో కలిసి అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగికంగా సంక్రమించే వ్యాధులకు చికిత్స అందించడం, పలు రకాల ల్యాబ్ సేవలు ఇక్కడ అందుతాయని తెలిపారు. జిల్లాలో ఉన్న ట్రాన్స్‌జెండర్లు ఈ క్లినిక్‌లో అందే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ, సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్, డీడబ్ల్యూఓ జరీనా, డాక్టర్ శశికాంత్, భాస్కర్ నాయక్, ఆర్‌ఎంఓ జరీనా, వైద్యులు నజ్మ, స్వప్న, విజయ్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుట్టలను తవ్వుతున్నారని ఫిర్యాదు



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న గిరిజనులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికల్ తండాలో విస్తరించి ఉన్న గుట్టలను అక్రమంగా తవ్వుతున్నారని తండావాసులు సోమవారం ఆర్డీఓ శ్రీనునాయక్, తహసీల్దార్ ఇబ్రహీంలకు ఫిర్యాదు చేశారు. విచ్చలవిడిగా తవ్వకాలు జరుగుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతోపాటు పర్యావరణం దెబ్బతింటుందని వివరించారు. గుట్టల పైనే నివాసం ఏర్పాటు చేసుకోవడంతోపాటు తవ్వకాలకు పాల్పడుతున్నారని తెలిపారు. విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. తవ్వకాలను ఆపాలని కోరితే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరమేష్, శ్రీనివాసులు, వెంకటయ్య, కృష్ణయ్య కోరారు.

కార్తీక మాసంలో పెరిగిన ఆదాయం

- ఆలయంలో భక్తుల రద్దీ
- చిరువ్యాపారుల్లో సంతోషం



కార్తీక మాసంలో అలంపూర్ ఆలయాల్లో భక్తుల సందడి

అలంపూర్: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలకు కార్తీక మాసంలో భారీగా ఆదాయం వచ్చింది. గతంలో కంటే ఈ ఏడాది కార్తీక మాసంలో భక్తులు ఆలయాలను అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ప్రధానంగా ఆది, సోమ, రెండో శనివారం, ఏకాదశి, పౌర్ణమి, అమావాస్య రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఫ్రీ బస్సుల కారణంగా భక్తులు గతంలో కంటే అధిక సంఖ్యలో వచ్చారని బావిస్తున్నట్టు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆలయాల్లో ప్రతి సోమవారం, కార్తీక పౌర్ణమిలో భక్తులతో దీపాలు వెలిగించడం, ఇందుకు సంబంధించిన ద్రవ్యాలను దేవస్థానమే భక్తులకు ఉచితంగా అందజేయడం, తుంగభద్ర నదిలో నదిహారతులు ఇవ్వడం వంటి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఆలయానికి ఆదాయం రూ.77,18,151 లక్షలు

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయానికి అభిషేకం, స్పర్శదర్శనాలు, అర్చనలు, చండీహోమం, ప్రసాదాలు ఇలా అన్ని కలిపి రూ. 77,18,151లక్షల ఆదయం వచ్చినట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి తెలిపారు. ప్రసాదం ద్వారా రూ.35,10,310 లక్షలు, అంతరాలయ దర్శనం ద్వారా, రూ.12,93,600లక్షలు, అన్నదానం ద్వారా రూ.5,39,711లక్షలు, ఆర్జిత సేవల, చండీహోమం, అభిషేకం, అర్చన ద్వారా రూ.23,74,530 లక్షల ఆదాయం లభించింది. కార్తీక మాసంలో భక్తులకు విశేషంగా అన్నదానం ఏర్పాటు చేసినట్లు దేవస్థానం వారు తెలిపారు. చిరు వ్యాపారులకు, లాడ్జీలు, అలయాలపై ఆధారపడిన పలు వ్యాపార సముదాయాలకు ఆదాయం రావడంతో ఎంతో సంతోషించారు.

4వ తేదీ ఆలయలో ప్రత్యేక హోమాలు

దేవదాయ శాఖ ఆదేశాలతో 4వ తేదీ ఉదయం గణపతి హోమం, నవగ్రహ హోమాలు, చండీహోమాలు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి పురేందర్‌కుమార్ తెలిపారు. ప్రముఖ క్షేత్రాలన్నింటిలో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

భక్తి పారవశంతో జన్మధన్యం



కార్తీక దీపోత్సవ కార్యక్రమం ప్రారంభిస్తున్న పీఠాధిపతి పంచమసిద్ధలింగేశ్వర మహాస్వామి



మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఠాధిపతి

- పీఠాధిపతి పంచమ సిద్ధలింగేశ్వర మహాస్వామి
- నేరడుగోమ్ ఆలయంలో పోటెత్తిన భక్తులు
- భక్తి శ్రద్ధలతో కార్తీకమాసం పూజలు
- వైభవంగా కార్తీక దీపోత్సవం

మక్తల్/మాగనూర్: ప్రతి ఒక్కరు భక్తి పారవశంతో ఉన్నప్పుడే మానవుని జన్మ ధన్యమవుతుందని, ప్రతి ఒక్కరు భక్తిమార్గంలో నడవాలని నేరడుగోమ్‌లో పంచమ సిద్ధవిరక్తి మఠం పీఠాధిపతి సిద్ధలింగేశ్వర మహాస్వామి అన్నారు. సోమవారం మాగనూర్ మండలం నేరడుగోమ్‌లో పంచమ సిద్ధలింగేశ్వర విరక్తి మఠం దగ్గర కార్తీక దీపోత్సవాన్ని సిద్ధలింగేశ్వర మహస్వామి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి వెలిగించి మహాశివ యోగిలతో ప్రారంభించారు. అనంతరం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడుచుకుంటూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆలపించిన భక్తి సంకీర్తనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్తీక మాసంలో దీపాలు వెలిగిస్తే పుణ్యకార్యాలు తమ వంతులో నిలుస్తాయన్నారు. అంతకు ముందు ముఖ్య నాయకులకు పీఠాధిపతి సన్మానం చేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో నారాయణపేట శాంతానంద పురోహితుడు, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహగౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాజుల ఆశిరెడ్డి, రఘు ప్రసన్నభట్, మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ ఎల్లారెడ్డి, సాదులింగప్ప, మాజీ ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, మారుతిగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహరెడ్డి, శంకరప్ప, మొగులప్ప పాల్గొన్నారు.

20.50 లక్షల ఎకరాలకు నీరందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో 20.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ. 7వేల కోట్లతో కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులు నిర్మించి, సుమారు 9 లక్షల ఎకరాలకు సాగునీరు అందించారని అన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాకు రూ. లక్ష కోట్లు కేటాయిస్తామని ప్రకటించారని.. తద్వారా పాలమూరు రూపురేఖలు పూర్తిగా మారుతాయని అన్నారు. ప్రాజెక్టుల ద్వారా నీటి వాటా దక్కించుకునేందుకు, పెండింగ్ పనుల పూర్తి, అవసరమైన ప్రాజెక్టుల పునర్జీవం, పాలమూరుకు కావాల్సిన అన్ని వసతులు సమకూర్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఒక్క జిల్లాకు ఐదేళ్ల కాలంలో రూ. లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పలేదని.. సీఎం రేవంత్‌రెడ్డిది సాహసోపేతమైన నిర్ణయమని అన్నారు. పాలమూరు రైతు పండుగతో ప్రజలకు ఏం ఒరిగిందని విమర్శించే వాళ్లు ఇప్పుడే సమాధానం చెబుతారని నిలదీశారు. పార్టీలను వదిలిపెట్టి ప్రజల కోసం, జిల్లా అభివృద్ధికి కలిసి రావాలని పరోక్షంగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి హితవు పలికారు. ఆర్డీఎస్‌ను పునర్జీవం చేస్తే 18 టీఎంసీలు జిల్లాకు దక్కుతాయని తెలిపారు. తద్వారా లక్ష 80వేల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. జూరాల ప్రాజెక్టు కేటాయింపునకు భిన్నంగా 5–6 టీఎంలు మాత్రమే వాడుతుండటంతో కేవలం లక్ష 2వేల ఎకరాలే సాగులోకి వస్తున్నాయన్నారు. జూరాల పూడిక తీసేందుకు ప్రభుత్వం ఆమోదంచిందని.. పనులు పూర్తయితే 16 టీఎంసీలతో లక్ష 60వేల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో జూరాల ఎత్తు పెంచేందుకు చర్చలు జరిపితే ఫలించవచ్చని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల సోర్స్‌గా కాకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రీశైలం సోర్స్‌గా ప్రతిపాదించడంతో వివాదం తలెత్తి పూర్తికాలేదని విమర్శించారు. జూరాల సోర్స్‌గా ఫేస్–2 కింద పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. గద్వాల– డోర్నకల్ రైల్వేలైన్ పనుల్లో వేగం పెరిగిందని.. కల్వకుర్తి నుంచి మాచర్ల రైల్వేలైన్ తెచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. సమావేశంలో బి.కృష్ణ, రాగివేణు, బాబా, కిరణ్‌కుమార్, యాదయ్య, వెంకటేష్, రామ్మూర్తినాయుడు, అబ్దుల్లా ఉన్నారు.

కురుమూర్తి హుండీ ఆదాయం రూ.79,68,810



కురుమూర్తి హుండీ డబ్బులను లెక్కిస్తున్న సిబ్బంది



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఆలయం మెట్లపై దీపాలు వెలిగిస్తూ..

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు, జాతర నెల రోజులపాటు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఉత్సవాలకు తెలంగాణ రాష్టంతో పాటు ఆంధ్రా, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి దాదాపుగా 12 లక్షల మంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అయితే భక్తులు స్వామివారికి మొక్కుబడిగా సమర్పించిన కానుకల హుండీలను ఆలయ అధికారులు నెల రోజుల్లో మూడు దఫాలుగా లెక్కించారు. మొదటిసారి హుండీ ఆదాయం రూ. 25,54,805, రెండవ సారి రూ. 22,78,894 వచ్చాయి. సోమవారం మూడవ సారి స్వామివారి హుండీని లెక్కించగా.. రూ 31,35,111 ఆదాయం వచ్చింది. ఈ సంవత్సరం ఉత్సవాలను పురస్కరించుకొని హుండీ ఆదాయం మొత్తం రూ. 79,68,810 వచ్చినట్లు ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వరెడ్డి తెలిపారు. గతేడాది హుండీ ఆదాయం రూ. 66,04,407 రాగా.. ఈ సంవత్సరం రూ. 13,64,403 అదనంగా వచ్చినట్లు ఈఓ తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, భాస్కరాచారి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

కురుమూర్తిస్వామి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శనాలను కల్పించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. ఆలయ మెట్లపై, స్వామివారి పాదుకల వద్ద, ఆలయ సన్నిధిలో మహిళలు దీపాలను వెలిగించారు. కొండ దిగువన దాసంగాలు సమర్పించి, గండదీపాలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. అలివేలు మంగమ్మ, ఉద్దాల మండపం, ఆంజనేయ స్వామి, చెన్నకేశవస్వామి ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది.